# మరో ఉద్యమానికి కదిలిన
# గులాబీ దండు



తాండూరు: నల్లగొండ సభకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలు

- చలో నల్లగొండ సభకు భారీగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
- చే జారుతున్న ప్రాజెక్టులపై నేతల మండిపాటు
- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై నిలదీత
- పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



బొంరాస్‌పేట నుంచి నల్గొండ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



ధారూరు మండలం నుంచి...



వికారాబాద్: జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



తాండూరు: నల్లగొండ సభకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలు

తాండూరు, ఫిబ్రవరి 13: కృష్ణాజలాల్లో న్యాయమైన హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పూరించిన సమరశంఖం సభకు మంగళవారం తాండూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల పరిధిలోని బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక వాహనాల్లో నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్‌లో విశాలమైన మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు ఉత్సాహంగా వెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ కోసం కేఆర్ఎంబీ ఇప్పటికే రూపొందించిన ఆపరేషనల్ ప్రొటోకాల్ ఏపీకీ వత్తాసు పలికేలా ఉందన్నారు. ఆపరేషనల్ ప్రొటోకాల్ ముసాయిదాలో చేసిన ప్రతిపాదనలతో తెలంగాణ 45 టీఎంసీల నికర జలాలను కోల్పోవాల్సిన ప్రమాదం ఏర్పడిందన్నారు. సహజ ప్రవాహాల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీటిని అందించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నాగార్జునసాగర్ నుంచే 72.2 టీఎంసీలను కేటాయిస్తూ ప్రొటోకాల్‌లో రూల్‌పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే కేటాయింపుకు మించి 29 టీఎంసీలను డెల్టాకు మళ్లిస్తున్నారని తెలిపారు. జలవిద్యుత్తు ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి చేసిన కరెంటును ఇరు రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో పంచుకోవాలని ఆర్ఎంసీ ప్రతిపాదించడంతో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రాజెక్టులు చే జారుతున్నాయని పేర్కొన్నారు. కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు తెస్తుందని విమర్శించారు.

**బొంరాస్‌పేట:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చలో నల్గొండ బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పార్టీ శ్రేణులు తరలి రావడానికి మండలానికి ఒక బస్సు కేటాయించారు. బహిరంగ సభకు వెళ్తున్న బస్సుకు, వాహనాలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి మండలంలోని తుంకిమెట్లలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సభకు వెళ్లిన వారిలో పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, సలాం, ఎంపీటీసీలు జగదీష్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

**వికారాబాద్:** వికారాబాద్ పట్టణం, మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్గొండలో జరిగే భారీ బహిరంగ సభకు మంగళవారం ఆర్టీసీ బస్సులో బయలు దేరారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ జెండా ఊపి ప్రారంభించారు.

**ధారూరు:** మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లగొండలో జరిగే బహిరంగ సభకు మంగళవారం ఆర్టీసీ బస్సులో బయలు దేరారు.



దోమ మండలం నుంచి...



కులకచర్ల, ఫిబ్రవరి 13 : కులకచర్ల మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు సీఎం కేసీఆర్ సభకు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. కులకచర్ల బస్టాండు నుంచి బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, మాలెకృష్ణయ్యగౌడ్, సారా శ్రీనివాస్, నర్సింహులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో మర్పల్లి వాసులు



మర్పల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు ఈ నెల 11న మర్పల్లి నుంచి అయోధ్యలో ఇటీవల ప్రతిష్ఠాపించిన రాముడిని దర్శించుకునేందుకు తరలివెళ్లారు. రెండు రోజు లు రైలులో ప్రయాణం చేసి మంగళవారం బాలరాముడిని దర్శించుకున్నట్లు వారు తెలిపారు.రాముడిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు

## మున్సిపల్ కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు



కొడంగల్, ఫిబ్రవరి 13: కొడంగల్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపల్ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు తెలిపారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కొడంగల్, ఫిబ్రవరి 13: పట్టణంలోని జీసీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం ప్రతిభకనబరిచిన రాం చరణ్, శివశంకర్‌లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు అబ్దుల్ హఖ్, సాలీబాయి, సబిహాబేగం, నసీంబాను తదితరులు పాల్గొన్నారు

## ఆంగ్ల బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, ఫిబ్రవరి 13 : పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం గెస్ట్ లెక్చరర్‌గా బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.రాజారాం కోరారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్లం పోస్టుకు సంబంధిత పీజీ సబ్జెక్ట్‌లో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, బీసీ, ఇతర అభ్యర్థులు 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎన్ఈటీ, ఎస్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ అదనపు అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్య ర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. వివరాలకు ఫోన్ నంబర్ 9701774143కు ఫోన్ చేసి సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

## 20న బంజారాల ఆధ్యాత్మిక వేడుకలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జాగోబంజారా నాయకులు

పెద్దేముల్, ఫిబ్రవరి 13 : జాగో బంజారా సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న యాడీబాపుగడ్ దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రం దగ్గర సంత్ సేవాలాల్ మహారాజ్ అవతార దినోత్సవం పురస్కరించుకుని బంజారాల ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించనున్నట్లు యాడీబాపుగడ్ దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రం ధర్మకర్తలు జాగోబంజారా సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్ నాయక్ మహారాజ్, రామావత్ శాంతిబాయి తెలిపారు. ఈ మేరకు ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను విడు దల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు భగవాన్ సేవాలాల్‌కు భక్తులు,గ్రామస్తులతో కలిసి భోగ్ సమర్పణ ఉంటుందని తరువాత పొరగడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్, ముఖ్యఅతిథి విఠల్ మహారాజ్‌ల ఆధ్యాత్మిక సందేశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం రాథోడ్, ఆకాష్, లక్ష్మీబాయి, పాండు, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

## 16న రథసప్తమి ఉత్సవాలు

వికారాబాద్, ఫిబ్రవరి 13 : ఈ నెల 16 వ తేదీన రథసప్తమి సందర్భంగా అనంతపద్మనాభస్వామి దేవాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించ నున్నట్లు ఆలయ ఫౌండర్ పద్మనాభం, ఈవో నరేందర్‌కు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7:30 గంటలకు సూర్యప్రభ, 9గంటలకు హనుమంత, 10:30 గంట లకు ముత్యాల పందిరి, 11గంటలకు గరుడ, మధ్యాహ్నం 3 గంట లకు గజవాహనం, సాయంత్రం 4గంటలకు సింహవాహనం, 5గం టలకు చంద్రప్రభ వాహనంపై అనంతపద్మనాభ స్వామి వారి సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా కక్షిదారుడు అయిన వై అభినవ్ S/O వై ఈ ప్రసాద రెడ్డి, 38 సం||లు, వ్యాపారవేత్త, ఫ్లాట్ నంబర్ 424, రోడ్ నంబర్ 78, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ - బార్వాద్ గ్రామము, కోటపల్లి మండలము, వికారాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రములో గల క్రింద కనబరచిన ఆస్తిని, క్రింద కనబరచిన వ్యక్తుల నందు ఖరీదుకు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు సిద్ధముగా ఉన్నారు. ఇట్టి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కు గానీ, అనుభవము గానీ, క్లెయిములు గానీ ఉన్న యెడల, వాటిని నిరూపించు పత్రాలను, ఆధారాలను, నా యెదుట ఈ ప్రకటన వెలువడిన ఏడు(7)దినములలోగా హాజరు పరుచవలయును. అట్లు హాజరుపరచని యెడల నా కక్షిదారుడు ఆస్తిని వివాదరహితముగా భావించి క్రింద కనబరిచిన వ్యక్తుల నుండి రిజిష్టర్ చేయించుకొని, విక్రయ ధనాన్ని చెల్లిస్తాడు. తదుపరి ఉత్పన్నమయ్యే సమస్యలకు నా కక్షిదారుడు బాధ్యుడు కాదు.

| హక్కుదారుని పేరు | సర్వే నంబర్ | విస్తీర్ణము Ac-Guntas | హద్దులు |
|---|---|---|---|
| బేగరి శ్రీనివాస్ S/O బేగరి మల్కయ్య బార్వాద్, కోటపల్లి వికారాబాద్ జిల్లా | 130/ఆ2 | ఎ 3-12 గుంll | ఉll వై అభినవ్ దll సర్వే నెం. 131&140 తూll వై అభినవ్ పll సర్వే నెం. 128 |
| | మొత్తం | ఎ 3-12 గుంll | |

**వి. రోహిత్**
న్యాయవాది, తెలంగాణ హైకోర్టు
H. No. 8-2-269/W/3, రోడ్ నెం. 2, బంజారా హిల్స్,
హైదరాబాద్ - 500033. మొబైల్ - 95500 10101

## వైష్ణవికి బంగారు పతకం



మొయినాబాద్, ఫిబ్రవరి 13 : క్రీడల్లో రాణించే విద్యార్థులకు సమా జంలో మంచి గుర్తింపు ఉంటుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(చేవెళ్ల) బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. మండలంలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న తెలం గాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని వైష్ణవి ఇటీవల జయశంకర్ భూపాలపల్లిలో జరిగిన తొమ్మిదో తెలంగాణ భద్రాది-కొత్తగూడెం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో అండర్-14 విభాగంలో 100 మీటర్ల పరుగుపదెంలో పాల్గొని బంగారు పతకాన్ని.. అదేవిధంగా 400 మీటర్ల రన్నింగ్ పోటీలో పాల్గొని మూడోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు


## గురుకుల పాఠశాల ఫలితాల్లో ఎంపిక




ఎంపికైన భరత్‌కుమార్, ప్రమీళ

కులకచర్ల, ఫిబ్రవరి 13 : ఇటీవల నిర్వహించిన గురుకుల పాఠశాల పరీక్షల్లో కులకచర్ల మండలానికి చెందిన అభ్యర్థులు ఎంపికయ్యారు. కులకచర్ల మండలం టేకుల తండాకు చెందిన భరత్ కుమార్ గురుకుల పీజీటీ బయోసైన్స్‌లో ఎంపిక కాగా చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రమీళ ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా ఎంపికయ్యారు. గురుకుల నియామక పరీక్షలో ఎంపికైన వారినికి కులకచర్ల, చౌడాపూర్ మండల ప్రజలు, ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు.

## గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి



జిల్లా సివిల్ సప్లయ్‌శాఖ అధికారి మనోహర్‌రాథోడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేత ఓరుగంటి యాదయ్య

షాబాద్, ఫిబ్రవరి 13: జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల అడ్డగోలుతనం పెరిగిపోతుందని, వాటిని అరికట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంగళవారం రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సివిల్ సప్లయ్ శాఖ అధికారి మనోహర్‌రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు చట్టబద్ధంగా సేవలందించాల్సిన గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలు జిల్లాలో అక్రమ దందాలు చేస్తున్నారని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల అక్రమ దందాల మూలంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధిక ధరలను వసూలు చేయడంతో పాటు గ్యాస్ సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని తెలిపారు. కొందరు వినియోగదారుల నంబర్లతో గ్యాస్ సిలిండర్లను బుక్ చేయిస్తూ నల్ల బజార్‌కు తరలిస్తున్నారని వివరించారు. వెంటనే వీటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోమటిరెడ్డి శశిధర్‌రెడ్డి ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కళావేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా విజయ్ కుమార్



మర్పల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని పంచలింగాల్ గ్రామానికి చెం దిన విజయ్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర కళావేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్ మంగళవారం ఎంపిక చేసినట్లు విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కళాకారుల పాత్ర ఎంతగానో ఉందని గుర్తు చేశారు. తనపై నమ్మకంతో జిల్లాధ్యక్షుడిని ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్‌కు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు

## బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేత



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎంపీ రాములుకు అందజేస్తున్న ఎగిరిశెట్టి సత్యం

ఆమనగల్లు, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని శెట్టిపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈ నెల 18 వరకు జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా మంగళవారం శెట్టిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఎగిరిశెట్టి సత్యం నాగర్ కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. వీరితో పాటు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కేఎన్ఆర్ యువసేన నాయకులు మెకానిక్ బాబా, విజయ్ రాథోడ్, నేతలు జంగయ్య, భిక్షపతి, నరేశ్, రవి, వెంకటేశ్, రాములు ఉన్నారు.

## ఎంపీడీవోకు ఘన సన్మానం




మంచాల, ఫిబ్రవరి 13: మంచాల మండల ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాస్ యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యాడు. మంగళవారం మంచాలలో సెర్ప్ సిబ్బంది మండల సమాఖ్య కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం శోభ మాట్లాడుతూ మండల సమాఖ్య అభివృద్ధి కోసం ఎంపీడీవో శ్రీనివాస్ కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు అనిత, స్వాతి, జైపాల్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దోమ, ఫిబ్రవరి 13 : దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోత్కూర్ గ్రామంలో జరిగింది. దోమ ఎస్సై రవిగౌడ్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూర్ గ్రామానికి చెందిన ఎర్రగడ్డపల్లి కృష్ణయ్య(25) చిన్నప్పటి నుంచి కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడని, కడుపు నొప్పి గురించి ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలో వైద్యం చేయించామని, అయినా నొప్పి తగ్గకపోగా, 11న ఉదయం కడుపు నొప్పి రాగా, మనస్తాపానికి చెందిన కృష్ణయ్య పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో కృష్ణయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మృతుడి అన్న ఎర్రగడ్డపల్లి సత్యయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.

## హనుమాన్ దేవాలయ మహోత్సవాలు..



ధారూరు, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో నూతన హనుమాన్ ఆలయ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మంగళవారం ధ్వజారోహణం, మహాసంకల్పం గణ పతి పూజ, నవగ్రహహోమం, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి



కారోబార్ నర్సిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామ యువకులు

పెద్దేముల్, ఫిబ్రవరి 13 : వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని పెద్దేముల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులకు లిఖితపూర్వకంగా రాసి వినతి పత్రాన్ని కారోబార్ నర్సిరెడ్డికి అందించి వీధి కుక్కల నుంచి ప్రజలు, చిన్నారులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ యువ నాయకులు ఎండీ.రియాజ్, బ్యాగరి శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దేముల్ మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ముఖ్యంగా గ్రామానికి చెందిన చిన్న పిల్లలు, స్కూల్‌కి వెళ్లే పిల్లలపైనా వీధి కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కోళ్ల శ్రీనివాస్ కుమారుడు అబ్నేర్(6) చాక్లెట్లు కొనుగోలు చేసేందుకు ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్న క్రమంలో వీధి కుక్కల గుంపు బాలుడిపై ఒక్కసారిగా దాడి చేసి శరీరంలో పలుచోట్ల గాయాలు చేయగా, ప్రస్తుతం ఆ బాలుడు తాండూరు జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఇప్పటికైనా గ్రామ స్పెషల్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని వీధి కుక్కల నుంచి గ్రామ ప్రజలు, చిన్నారులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యువ నాయకులు ఎండీ.రియాజ్, బ్యాగరి శ్రీనివాస్, వార్డు సభ్యులు మల్లేశం, ఫయాజ్, గోపాల్, ప్రకాష్, చందు, శ్రీనివాస్, గోరేపాషా, శ్రీను, వెంకట్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 40 గొర్రెలు మృతి

దోమ, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో కుక్కల దాడిలో 40 గొర్రెలు మృతి చెందగా, 5 గొర్రెలకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి కొత్తపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కుంట మల్లేశం, బొంగు లింగయ్యలకు చెందిన గొర్రెలను తన పొలం వద్ద ఏర్పాటు చేసిన కంచెలో ఉంచాడు. రాత్రి పూట గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా, 40 గొర్రెలు మృతి చెందగా, మరో 5 గొర్రెలకు గాయాలైనట్లు గొర్రెల కాపర్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.3 లక్షలకు పైనే ఉంటుందని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962